క్లుప్తంగా

7న డప్పుల ప్రదర్శనకు తరలిరావాలి

బేల: ఇచ్చోడలో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ డప్పుల ప్రదర్శనకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. మాదిగతో పాటు ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణపెల్లి అంకుష్, మడిపెల్లి మనోజ్, అల్లకొండ భూమన్న, అనిల్, అంకుష్, పసుల శ్రీనివాస్, హరికృష్ణ, స్వామి, దత్తు, విలాస్, విశాల్ పాల్గొన్నారు.

సెల్ టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

బజార్‌హత్నూర్: మండలంలోని అటవీ ప్రాంతంలో గల ఆదివాసీ గిరిజన గ్రామాలైన గిరిజాయి, డేడ్ర, మాన్కపూర్, ఉమార్డ, బద్దునాయక్‌తండా, ఇంద్రనగర్ గ్రామాల ప్రజలకు మొబైల్ నెట్‌వర్క్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు బుధవారం తహసీల్దార్ శ్యాంసుందర్ స్థలాలను పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఎంసీ బాపురావ్, మాజీ సర్పంచులు ప్రియాంక అనిల్, శంకర్, రాధ సీతారాం, సాయికృష్ణ, లింగుపటేల్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

బోథ్: అడవిలో అగ్ని ప్రమాదాలపై రైతులు, గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు అన్నారు. బుధవారం సొనాల మండలంలోని పుణ్యానాయక్‌తండా, పార్డి(కె) గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వనరులను పరిరక్షించే విషయాలపై అవగాహన కల్పించారు. అనేక పర్యావరణ సమతుల్యత, అటవీ పరిరక్షణ, అడవిని కాపాడటం, అగ్ని ప్రమాదం, అడవి జంతువులను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ముంతాజ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాధేశ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిశుభ్రతే ధ్యేయంగా పనిచేసే పారిశుద్ధ్య కార్మికులపై దాడులకు పాల్పడటం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్రా దేవేందర్ అన్నారు. పట్టణంలోని దుర్గానగర్‌లో పారిశుద్ధ్యం పనులు చేస్తున్న కార్మికులపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసే పారిశుద్ధ్య కార్మికులపై దాడులకు దిగడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృత్తం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పోలీసు యంత్రాంగాన్ని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, కాంతారావు, ఎస్.నారాయణరెడ్డి, సురేశ్, లక్ష్మి, సంగీత పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థినులు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. మహిళా సైబర్ జాగృతి దినోత్సవం సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు కళాశాలల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు, వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, ఐటీ కోర్ రియాజ్, షీటీం ఏఎస్సై సునీత తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రోజురోజుకూ జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయండి

● కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో చదివే విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 7నుంచి 20వ తేదీ వరకు అన్ని సంక్షేమ హాస్టల్స్, స్కూల్స్ విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే టీమ్ ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. స్క్రీనింగ్ చేయడం ద్వారా నేర్పు, ఆరోగ్యం, మానసిక పరిస్థితులను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించేందుకు తోడ్పడుతుందన్నారు. ప్రతీ గురువారం విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు తప్పనిసరిగా అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టీబీ పేషంట్ల వివరాలతో కూడిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలుడికి కలెక్టర్ ప్రశంస

జిల్లా కేంద్రానికి చెందిన ద్యావంత్ మోక్ష అద్వైత్ ఇటీవల జూనియర్ స్టార్ ఆర్టిస్ట్ అవార్డు సాధించడం పట్ల కలెక్టర్ రాజర్షి షా బుధవారం అభినందించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంతోషం వ్యక్తం చేశారు. చదువుతో పాటు కళల్లో సైతం రాణించడం గొప్ప విషయమన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలి

● ఎస్పీ గౌస్ ఆలం ఆదేశం


వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణ అవలంబిస్తున్నట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయం నుంచి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్స్‌ను గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లేజర్‌గన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు విస్తృతంగా డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని సూచించారు. రాంగ్ రూట్లో వెళ్లేవారికి జరిమానా విధించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పాండేరావు, అధికారులు పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ'లో నాణ్యమైన వైద్యసేవలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇటీవల నిర్వహించిన నాలుగు ఆపరేషన్ల వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఇందులో క్యాన్సర్‌తో పాటు న్యూరోకు సంబంధించిన శస్త్ర చికిత్సలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు అయ్యే క్యాన్సర్ చికిత్సను పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు జక్కుల శ్రీకాంత్, మోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


గ్రామస్తులతో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: దుబార్‌పేట్ గ్రామ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం దుబార్‌పేట్ గ్రామస్తులు అనిల్‌జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ చహకటి రవి, గ్రామస్తులు ఉన్నారు.

దర్గాను సందర్శించాలని ఆహ్వానం

బోథ్ మండల కేంద్రంలోని పిప్పల్‌దరి గ్రామానికి వెళ్లే గుట్టపై గల సైలానిబాబా దర్గాను సందర్శించాలని దర్గాకమిటీ సభ్యులు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'దేవనంద్‌పై విచారణను స్వాగతిస్తున్నాం'


మాట్లాడుతున్న నాయకులు

ఇచ్చోడ: మాజీ ఎంపీటీసీ చౌహన్ దేవనంద్‌పై విచారణను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం స్వాగతిస్తున్నట్లు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు రాథోడ్ భీంరావు, ఆడే మానాజీ, రాథోడ్ శివలాల్ నాయక్ అన్నారు. బుధవారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చౌహన్ దేవనంద్ ఇంట్లో ట్రైబల్ కమిషన్ నుంచి వచ్చిన అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసినట్లు తెలిపారు. దేవనంద్ ఎస్టీ లంబాడా జాతికి చెందిన వ్యక్తి కాదని ఆయన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఎన్నికలలో పోటీ చేస్తున్నాడని ఆరోపించారు.

దేవనంద్‌పై విచారణ..

మండల కేంద్రానికి చెందిన చౌహన్ దేవనంద్ ఇంట్లో బుధవారం హైదరాబాద్ ట్రైబల్ కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు విచారణ చేపట్టారు. ఎస్టీ లంబాడా జాతికి చెందిన వ్యక్తి కాదని లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను విచారించారు. కుటుంబ నేపథ్యం, భాషా, కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ అధికారులతో ఐటీడీఏ ఏపీవో జాదవ్ వసంత్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ ఉన్నారు.

తల్లిదండ్రుల సంక్షేమానికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: వయోవృద్ధుల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణను యువత బాధ్యతగా తీసుకొని వారి సంక్షేమానికి పాటుపడాలని వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం మండలంలోని పొచ్చర గ్రామంలో వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో తల్లిదండ్రుల పోషణ, సంక్షేమము చట్టం 2007 గురించి అవగాహన కల్పించారు. సమాఖ్య కార్యదర్శి రాంకులకర్ణి, హన్మంత్ రెడ్డి, నర్సిములు, శివప్రసాద్, రాజారెడ్డి, ఆశన్న, దామోదర్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ల ఆందోళన


నిరసన తెలుపుతున్న మల్టీపర్పస్ వర్కర్లు

నార్నూర్: గ్రామపంచాయతీ పరిధిలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఆందోళన చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మండల అధ్యక్షుడు జిల్లెపల్లి బాపూరావు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు మంజూరు చేయకపోవడంతో ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ వర్కర్లపై చిన్నచూపు తగదని అన్నారు. అధికారులు ఇచ్చే చెక్కులను తీసుకొని బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎంపీడీవో జవహర్‌లాల్ హామీతో మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళన విరమించారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ కోరారు. బుధవారం గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలో అంతర్జాతీయ ఆదివాసీ మహిళ దినోత్సవం పోస్టర్‌ను తుడుందెబ్బ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళలు ఏకతాటిపెకై వచ్చి జిల్లా కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. మహిళల హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయిసెంటర్ గీతేదారి కొడప జాకు, మెస్రం సోము పటేల్, దేవరావు, మధు, విజయ్, సంతోష్ పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్

● ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

బేల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం సాత్నాల మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి పలువురు మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం క్రమం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, ఎన్నాల నగేశ్, సుభాష్, బోయర్ విజయ్, సురేశ్, రాము పాల్గొన్నారు.

6,7న క్రీడా పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మార్చి 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో సాయంత్రం 5.45 గంటలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, టి. నరసింహస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440824535, 9640091331 సంప్రదించాలని కోరారు.

విజయ డెయిరీ డీడీ మధుసూదన్ బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌గా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న మధుసూదన్ హైదరాబాద్‌కు జీఎంగా బదిలీ అయ్యారు. బుధవారం తత్వమసి యోగా క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఇక్కడ పని చేసిన కాలంలో అందరి సహకారం లభించిందన్నారు. యోగా క్లబ్ నిర్వాకులు విజయ్ పాల్గొన్నారు.

మల్లన్న పల్లకి ఊరేగింపు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో జాతర మొదటి రోజు మంగళవారం రాత్రికి మల్లన్న పల్లకి ఊరేగించారు. జాతరలో భాగంగా ప్రతీ ఏటా పల్లకి ఊరేగించడం అనవాయితీగా వస్తుంది. అనంతరం ఆలయ చుట్టూ ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు తృప్తి మహేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండలంలోని మాట్‌లొద్ది గ్రామంలోని ఆంజనేయ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఎల్కూచి శ్రావణ్ కుమార్ జోషి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

రెమ్యునరేషన్, డ్యూటీ సర్టిఫికెట్ అందించాలి

బోథ్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి రెమ్యునరేషన్‌తో పాటు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని బోథ్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు ఆర్‌టీవీ ప్రసాద్ కోరారు. బుధవారం ఎంపీడీవో రమేశ్‌ను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, బిక్క గంగయ్య, రవిరాజ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు


తాంసిలో..


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్

ఇచ్చోడ: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటలలోపే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాళ్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై తిరుపతి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో ఇంటర్మీడియేట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పూలాజీబాబా జూనియర్ కళాశాలలో 438 మందికి విద్యార్థులకు 378 మంది, ఏఆర్ఎస్ కళాశాలలో 304 మంది విద్యార్థులకు 271 మంది, ప్రభుత్వ గిరిజన జూనియర్ కళాశాలలో 368 మందికి 318 మంది హాజరు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 346 మందికి 293 మంది హాజరయ్యారు. అలాగే గిరిజన జూనియర్ కళాశాలలో 348 మంది విద్యార్థులకు 289 మంది, చైతన్య జూనియర్ కళాశాలలో 272 మందికి 248 హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ సందర్శించారు.

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 454 మంది విద్యార్థులకు 444 విద్యార్థులు హాజరయ్యారు. ఎస్సై రాధిక పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రిసెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 277 మంది విద్యార్థులకు.. 254 మంది విద్యార్థులు హాజరయ్యారు. క్రిసెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 170 మంది విద్యార్థులకు 165 మంది హాజరై పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పరిశీలించారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి


డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బజార్‌హత్నూర్ మోడల్ స్కూల్, కళాశాల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. అసభ్యకరమైన ఫొటోలు తీస్తూ.. సోషల్ మీడియాలో షేర్ చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్ఎంను తక్షణమే విధుల నుంచి తొలగించాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

నోట్‌బుక్స్ అందజేత

బోథ్: సొనాల మండలంలోని నవ నిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కోస్మెట్టి శుద్ధోధన్ ఆదివాసీ గ్రామాల్లోని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాదవ్ పవన్, పడిగెల నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్


వంటకాలను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం

బేల: మండల కేంద్రంలోని బాది గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. సిర్సన్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై వంకాలను పరిశీలించి, రుచి చూశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాలతో విద్యార్థులతో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టీఎస్ స్వామి, సీఆర్పీ వెంకన్న, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

దద్దుర్లతో చిన్నారుల అవస్థలు


దద్దుర్లతో బాధపడుతున్న కిరణ్

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిత్తబట్ట గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు తామర వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు నెలల నుంచి చిత్తబట్ట గ్రామానికి చెందిన గుడిహత్నూర్ మండలంలోని తోషం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న కోవా కైలాష్, కోవా కిరణ్‌లతో పాటు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నాగోరావ్, అనిల్ అనే చిన్నారులు దద్దుర్ల వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో పాఠశాల నిర్వాహకులు విద్యార్థులను ఇంటికి పంపించారు. పలు ఆసుపత్రుల్లో చూయించిన వ్యాధి నయం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని వాపోతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి


హెల్త్‌కార్డును పరిశీలిస్తున్న మెస్రం ఛాయా

నార్నూర్: పదో తరగతి పరీక్షలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. బుధవారం మండలంలోని మాన్కాపూర్, జామ్డా, నార్నూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈనెల 6 నుంచి 15 వరకు విద్యార్థులకు నిర్వహించే ప్రీఫైనల్ పరీక్షల పై ఆరా తీశారు. విద్యార్థులకు సంబంధించిన హెల్త్ కార్డులను పరిశీలించారు. ఆమె వెంట పీజీహెచ్ఎంలు చౌహాన్ వందన, జాదవ్ విటల్, వార్డెన్ పవర్ వనిత, తదితరులు పాల్గొన్నారు.